# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు.

- రాజధాని అమరావతి భూ వివాదాలకు సంబంధించిన అంశాలను త్వరలో పరిష్కరిస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.

- ఎన్టీఆర్ భరోసా పథకం కింద జనవరి నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్‌ను ఈనెల 31వ తేదీనే లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 129వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

- గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా కృషి చేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

=====================

జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఈరోజు జరిగిన సమీక్ష సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగింది. గత నెల 27న జిల్లాల పునర్విభజనపై ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై నెల రోజుల పాటు అభ్యంతారాలను రాష్ట్ర ప్రభుత్వం స్వీకరిస్తుంది. ఈ గడువు నేటితో ముగియనున్నది. ప్రాథమిక నోటిఫికేషన్ అనంతరం వ్యక్తమైన అభ్యంతారాలపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకూ 927 అభ్యంతరాలు రాగా... వాటిని పరిశీలించిన అనంతరం ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. మార్పులు, చేర్పుల తర్వాత ఈనెల 31న ప్రభుత్వం తుది నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ సమీక్షలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, పి. నారాయణ పాల్గొన్నారు.

=====================

రాజధాని అమరావతి భూ వివాదాలకు సంబంధించిన అంశాలను త్వరలోనే కొలిక్కి తీసుకొస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. రాజధాని రైతుల సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులైన పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తాడికొండ శ్రవణ్‌కుమార్ ఈరోజు సీఆర్‌డీఏ కార్యాలయంలో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణ పనుల్లో అమరావతి ప్రాంతానికి చెందిన దాదాపు 10 వేల మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జరీబు భూముల సమస్యపై సర్వే పూర్తి చేశామని, కమిటీ నివేదిక ఆధారంగా జరీబు రైతులకు న్యాయం చేస్తామన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు 30 ఏళ్లపాటు లింక్ డాక్యుమెంట్‌లు అడగకుండా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

=====================

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జనవరి 01న పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ సామాజిక భద్రతా భరోసా పింఛన్లను ఒక రోజు ముందుగా ఈ నెల 31న పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 31వ తేదీ ఉదయం నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్లను పంపిణీ చేస్తామని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు.

=====================

రాష్ట్రంలో ఐదు నూతన ఆయుష్ ఆసుపత్రులను ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తిరుపతిలో జరుగుతున్న భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ లో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సంప్రదాయ వైద్య విధానంలో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఆయుష్ ద్వారా సంప్రదాయ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేస్తున్నామని, యోగాకు ప్రాధాన్యత ఇస్తున్నామని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

=====================

నర్సీపట్నం నియోజకవర్గాన్ని ఆరోగ్య కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. నర్సీపట్నంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 2 కోట్ల 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న `ప్రసూతి నిరీక్షణ కేంద్రం` (Birth Waiting Hall) నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ... గర్భిణీలు ప్రసవాల కోసం చివరి నిమిషంలో ఆసుపత్రికి రావడం వల్ల తలెత్తుతున్న అనర్థాలను నివారించేందుకు ఈ ప్రసూతి నిరీక్షణ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 129వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

విరామం

=====================

వైకుంఠ ఏకాదశికి తిరుమలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలో పాత్రికేయులతో

ఆయన ఈరోజు మాట్లాడుతూ... పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో 90 శాతం సమయాన్ని సామాన్య భక్తులకే కేటాయిస్తామన్నారు. డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీకి సంబంధించి ప్రతిరోజు 60 వేల చొప్పున లక్షా 80 వేల టోకెన్లను భక్తులకు ఆన్ లైన్ ద్వారా ఇప్పటికే అందించామన్నారు. జనవరి 2వ తేదీ నుంచి టోకెన్లు లేకపోయినా భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలను కల్పిస్తామన్నారు. రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేశామని అనిల్ కుమార్ సింఘాల్ తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=====================

వందే భారత్ రైలుకు హిందూపురంలో స్టాప్ ఇవ్వడం స్థానిక ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన బహుమతిగా రైల్వే శాఖ సహాయ మంత్రి వి. సోమన్న పేర్కొన్నారు. పార్లమెంట్ సభల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా ఎంపీలు హిందూపురంలో వందే భారత్ రైలును నిలపాలని కోరగా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. హిందూపురం రైల్వే స్టేషన్‌లో యశ్వంత్‌పూర్ నుంచి కాచిగూడకు వెళ్లే వందే భారత్ రైలును కేంద్ర సహాయ మంత్రి సోమన్న ఈ రోజు ప్రారంభించారు.

=====================

గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురంలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. గిరిజన రైతుల కోసం అన్ని ఐటీడీఏలకు ట్రైకార్ ద్వారా 13 కోట్ల 70 లక్షల రూపాయలు విడుదల చేశామన్నారు. అలాగే ఐటీడీఏల ద్వారా 90 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. గిరిజన కుటుంబాల అదనపు ఆదాయం కోసం పెద్ద ఎత్తున గోకులాలను మంజూరు చేసి పశుపోషణను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

=====================

విజయనగరం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఇన్ ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య తంత్రవాహి శ్రీనివాసన్ తెలిపారు. ఎం.ఏ. సోషియాలజీ, ఎం.ఏ. ట్రైబల్ స్టడీస్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఎన్.టి.ఏ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

=====================

ఎర్రచందనం అక్రమ రవాణాకు ఈ ఏడాది పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేశామని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ... క్షేత్రస్థాయి ఆపరేషన్లు, అంతరాష్ట్ర పోలీసుల సమన్వయంతో ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకున్నామని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో 64 కేసులు నమోదు చేసి.. 263 మందిని అరెస్ట్ చేశామని, 1,872 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని ఆయన వెల్లడించారు.

=====================

మారేడుమిల్లి, రంపచోడవరం అటవీ ప్రాంతం వైపుకు వెళ్లే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు ఒక ప్రకటనలో సూచించారు. కొద్దిరోజుల క్రితం మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుల మృతితో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

=====================

======================